# నమస్తే తెలంగాణ

## ఆదిలాబాద్ - నిర్మల్

5 | నిజామాబాద్, శుక్రవారం 18 ఏప్రిల్ 2025 | ADILABAD NIRMAL


## నైపుణ్యాలు పెంపొందించేలా విద్య



నమూనాను పరిశీలిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

సోన్, ఏప్రిల్ 17 : మానవ శరీర ధర్మ శాస్త్రానికి సంబంధించి పరిజ్ఞానం పెంపొందించేలా వివిధ రకాల నమూనాల ఏర్పాటుతో ఆచరణాత్మక విద్యనభ్యసించడం ద్వారా విద్యార్థులకు అన్ని అంశాలు సులువుగా అర్థమవుతాయని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. గురువారం సోన్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలను సందర్శించారు. ఖగోళ విజ్ఞాన ప్రయోగశాలను పరిశీలించారు. ఏ ప్రైవేటు పాఠశాలలోనూ ఇలాంటి ప్రయోగశాల లేదన్నారు. వీటి ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం, పఠనాసక్తి, నైపుణ్యాలు పెరుగుతాయని తెలిపారు. డీఈవో రామారావు, సెక్టోరల్ అధికారి రాజేశ్వర్, జిల్లా సైన్స్ అధికారి వినోద్, ఎంఈవో తొడిశెట్టి పరమేశ్వర్, హెచ్ఎం ఆరాదన పాల్గొన్నారు.

## నవోదయ స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, తహసీల్దార్

భీంపూర్, ఏప్రిల్ 17 : భీంపూర్ మండల కేంద్రానికి దగ్గరగా ఉన్న కొలాం గిరిజన ఆవాసం గుంజాల శివారులో నవోదయ పాఠశాల ఏర్పాటు కోసం కలెక్టర్ రాజర్షిషా గురువారం స్థల పరిశీలన చేశారు. స్థానికంగా ఉన్న ఆవశ్యక వనరుల గురించి అధికారులతో తెలుసుకున్నారు. నవోదయ విద్యాలయం నిర్మాణాత్మకంగా గుంజాల వద్ద లేదా సెంటర్ సాంగ్వి వద్ద ఏర్పాటయితే పేద, మధ్య తరగతి పిల్లలకు ప్రయోజనం చేకూరుతుందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఆర్డీవో వినోద్‌కుమార్, తహసీల్దార్ నలంద ప్రియ, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మాజీ జడ్పీటీసీ కుమ్ర సుధాకర్, రైతు సంఘం జిల్లా నాయకులు బక్కి గోవర్ధన్ యాదవ్, నరేందర్, కల్చాప్ యాదవ్, నారాయణరావు దేశ్‌ముఖ్, కపిల్, జహూర్ అహ్మద్, సంజీవ్‌రెడ్డి ఉన్నారు.

# పల్లెల్లో పడకేసిన పాలన

నాడు ఆదర్శం.. నేడు అధ్వానం

## ప్రభుత్వ పట్టింపులేని తనంతో అస్తవ్యస్తంగా పంచాయతీలు

- పాలకవర్గాలు లేక నిధులివ్వని కేంద్రం
- ఏడాదిన్నరగా దమ్మిడీ విదిల్చని కాంగ్రెస్ సర్కారు
- మూలనపడిన ట్రాక్టర్లు, ట్యాంకర్లు
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 85 ట్రాక్టర్లు నిరుపయోగం
- తాగునీటి సరఫరా భారం పూర్తిగా జీపీలపైనే..
- ఈజీఎస్ నిధులనే ట్రాక్టర్లకు వాడుకోవాలంటున్న రాష్ట్ర ప్రభుత్వం
- నిర్వహణ భారం మోయలేక తలలు పట్టుకుంటున్న కార్యదర్శులు

కన్నెపల్లి మండలం మాడవెల్లిలో రిపేర్లు చేయక నిరుపయోగంగా ఉన్న ట్రాక్టర్





జైనథ్ గ్రామంలో పనిచేయని ట్రాక్టర్

### పల్లెప్రగతి ట్రాక్టర్ల వివరాలు..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పని చేయని పల్లెప్రగతి ట్రాక్టర్లు

**ఆదిలాబాద్ జిల్లాలో..**

| మండలం | మొత్తం ట్రాక్టర్లు | పనిచేయనివి |
|---|---|---|
| ఆదిలాబాద్ రూరల్ | 34 | 4 |
| ఉట్నూర్ | 37 | 4 |
| బజార్ హత్నూర్ | 28 | 13 |
| జైనథ్ | 42 | 22 |
| ఇచ్చోడ | 34 | 2 |
| సిరికొండ | 19 | 1 |
| బేల | 37 | 1 |
| భీంపూర్ | 26 | 2 |
| నేరడిగొండ | 32 | 2 |

**కుమ్రం భీం ఆసిఫాబాద్..**

| | | |
|---|---|---|
| ఆసిఫాబాద్ రూరల్ | 27 | 1 |
| కెరిమెరి | 31 | 10 |
| లింగాపూర్ | 14 | 2 |
| దహెగాం | 24 | 4 |

**మంచిర్యాల..**

| | | |
|---|---|---|
| జైపూర్ | 20 | 1 |
| కన్నెపల్లి | 15 | 9 |
| కాసిపేట | 22 | 1 |
| వేమనపల్లి | 14 | 2 |
| తాండూర్ | 15 | 1 |




బజార్‌హత్నూర్ మండలం బోస్ గ్రామంలో టైర్ పగిలిపోయి మరమ్మతులు చేయక మూలనపడిన చెత్త సేకరణ ట్రాలీ

మంచిర్యాల, ఏప్రిల్ 17(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : బీఆర్ఎస్ పాలనలో పదేళ్లు కళకళలాడిన గ్రామ పంచాయతీలు.. ప్రస్తుతం పట్టించుకునే నాథులు లేక అస్తవ్యస్తంగా మారాయి. పాలకవర్గాలు లేక పాలన పడకేయగా, ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ కరువై సమస్యల్లో చిక్కుకొని కొట్టుమిట్టాడుతున్నాయి. కాంగ్రెస్ సర్కారు ఏడాదిన్నరగా నిధులివ్వకపోగా, నిర్వహణ భారం మోయలేక పంచాయతీ కార్యదర్శులు కన్నీళ్లు పెట్టుకోవాల్సిన పరిస్థితులు దాపురించాయి.

### కేసీఆర్ సర్కారులో ఆదర్శం.. ప్రస్తుతం అధ్వానం

పల్లెలను పట్టణాలకు దీటుగా తీర్చిదిద్దేందుకు కేసీఆర్ సర్కారు 'పల్లె ప్రగతి' ద్వారా అనేక కార్యక్రమాలు చేపట్టింది. పల్లెలను ప్రగతి పథంలో నడిపించి ఆదర్శంగా తీర్చిదిద్దింది. పల్లె ప్రకృతి వనాలు, బృహత్ పల్లె ప్రకృతి వనాలు, ప్రతి పంచాయతీకి చెత్త సేకరణ ట్రాక్టర్లు, మొక్కలకు నీరు పట్టేందుకు ట్యాంకర్లు సమకూర్చింది. పారిశుధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యం ఇస్తూ సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించింది. ప్రతి గ్రామంలో వైకుంఠధామాలను అందుబాటులోకి తెచ్చింది. కానీ, కాంగ్రెస్ గెలిచిన ఏడాదిన్నరలో పల్లెల పరిస్థితి పూర్తిగా తారుమారైపోయింది. పట్టించుకునే వారు లేక పల్లె ప్రకృతి వనాలు ఎండిపోతున్నాయి. నిధులు లేక పంచాయతీలకు సమకూర్చిన ట్రాక్టర్లు మూలన పడ్డాయి. నడుస్తున్న వాహనాలకు సైతం చాలా వరకు రిపేర్లు ఉన్నాయి. ఒక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే దాదాపు 85 ట్రాక్టర్లు మూలనపడి నిరుపయోగంగా మారాయి. ఇక రాష్ట్రవ్యాప్తంగా ఆ సంఖ్య వేలల్లో ఉండే అవకాశాలు ఉన్నాయి. నిధులు లేక ట్రాక్టర్ల నిర్వహణ కష్టమవుతుందని పంచాయతీ కార్యదర్శులు చెబుతున్నారు.

### ఏడాదిన్నరగా నిధుల్లేవ్..

కేసీఆర్ సర్కారు పల్లెప్రగతి కార్యక్రమాన్ని 2019లో మొదలుపెట్టింది. అంతకుముందు పాత గోడలు, పాడుబడ్డ భవనాలు, అధ్వానపు రోడ్లతో అవస్థల్లో ఉన్న గ్రామాల దశాదిశా ఒక్కసారిగా మారిపోయింది. కేంద్ర ప్రభుత్వం ప్రతి నెలా 15వ ఆర్థిక సంఘం నిధులు ఎన్ని ఇస్తే, దానికి సమానంగా ప్రతి నెలా కేసీఆర్ సర్కారు మ్యాచింగ్ గ్రాంట్ ఇచ్చింది. దీంతో గ్రామాలకు నిధుల వరద పారింది. ఒక్కసారిగా పల్లెల రూపురేఖలు మారిపోయింది. 2024లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అప్పటి నుంచి గ్రామాలకు ఇప్పటి దాకా ఒక్క పైసా కూడా ఇవ్వలేదు. పాలకవర్గాలు లేకపోవడంతో కేంద్రం నుంచి రావాల్సిన ఆర్థికసంఘం నిధులు ఆగిపోయాయి. కేంద్ర నిధులు రాక, రాష్ట్ర ప్రభుత్వం పైసా ఇవ్వక గ్రామాల్లో అభివృద్ధి ఎక్కడికక్కడ నిలిచిపోయింది. గతంలో కేసీఆర్ సర్కారు చేసిన పనులను సైతం కొనసాగించే పరిస్థితి లేకుండా తయారైంది. పాలకవర్గాలు లేని సమయంలో ఆలనా.. పాలనా చూడాల్సిన రాష్ట్ర సర్కారు చేతులు ఎత్తేసింది. దీంతో గ్రామాలు సమస్యల సుడిగుండంలో చిక్కుకుపోతున్నాయి. పల్లె ప్రకృతి వనాలు, చెత్త సేకరణ ట్రాక్టర్లు, సెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణ భారంగా మారింది.

### ఈజీఎస్ నుంచి నిధులు వాడుకోండి..

గతంలో గ్రామపంచాయతీలకు కేంద్ర, రాష్ట్రాల నుంచి వచ్చే నిధుల్లో 20 శాతం శానిటేషన్‌కు, 5 శాతం గ్రీన్ మేనేజ్‌మెంట్‌కు, 2 శాతం నిధులు ఇతర ఖర్చులకు వాడుకునేవారు. కానీ ఇప్పుడు వీటికి ఎలాంటి ప్రత్యేక నిధులు రావడం లేదు. పారిశుధ్య పనులు చేయాలంటూ ఒత్తిడి తెస్తున్న సర్కారు.. ఫండ్స్ మాత్రం ఇవ్వడం లేదని పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు. ఉపాధి హామీ పథకం కింద మొక్కలు నాటి, వాటి నిర్వహణకు వచ్చే ఫండ్స్‌తో ట్రాక్టర్లు నడిపించాలని ఉన్నతాధికారులు చెబుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత సర్కారులో రోజూ ట్రాక్టర్లు తీశారని, ఇప్పుడు వారానికి ఒకసారైనా తీయాలని చెబుతున్నారని చెప్పుకొచ్చారు. ట్రాక్టర్ల మరమ్మతుల భారం తమపైనే వేస్తున్నారంటున్నారు. వచ్చిన జీతం పంచాయతీల్లో పెట్టుబడులు పెట్టడానికే పోతుందంటున్నారు. స్ట్రీట్ లైట్లు మార్చడానికి సైతం మా జేబుల్లో నుంచే ఖర్చు పెడుతున్నామంటున్నారు. వేసవి తీవ్రత పెరిగిన నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు ఎక్కువయ్యాయి. అంతకుముందు గ్రామాల్లో ఉన్న మల్టీ పర్పస్ వర్కర్లను కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ మిషన్ ఉద్యోగులుగా చూపిస్తున్నారు. కేంద్రం నుంచి వచ్చే జీతాలనే మల్టీ పర్పస్ వర్కర్లకు ఇస్తున్నారు. దీంతో మిషన్ భగీరథ అధికారులు తాగునీటి సమస్యలకు పంచాయతీలనే బాధ్యులను చేస్తున్నారు. ఎక్కడ పైప్‌లైన్ లీకేజీ జరిగినా, ఎక్కడ బోర్ పనిచేయకపోయినా ఆ పనులు సైతం మాకే చెబుతున్నారంటూ పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు. బోర్లు బాగు చేయించడానికి చందాలు సేకరించాల్సిన దుస్థితి నేడు పల్లెలో ఉందంటున్నారు. నిధులు లేకుండా ట్రాక్టర్లు నడపమంటే, డబ్బులు లేకుండా పల్లె ప్రకృతి వనాలు, సెగ్రిగేషన్ షెడ్లు నడపమంటే ఎక్కడికి పోవాలో అర్థం కావడం లేదంటున్నారు. ఇప్పటికైనా స్పందించి గ్రామాలకు నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

## 'చలో వరంగల్'ను సక్సెస్ చేద్దాం

- కుభీర్ సన్నాహక సమావేశంలో కిరణ్ కొమ్రెవార్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కిరణ్ కొమ్రెవార్

కుభీర్, ఏప్రిల్ 17 : ఈనెల 27వ తేదీన వరంగల్‌లో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు కార్యకర్తలు, నాయకులు, శ్రేయోభిలాషులు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయకర్త కిరణ్ కొమ్రెవార్ పిలుపునిచ్చారు. కుభీర్‌లో గురువారం పార్టీ మండల అధ్యక్షుడు అనిల్ అధ్యక్షతన కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీకి 25 ఏళ్లు నిండిన సందర్భంగా కనీవినీ ఎరుగని రీతిలో రజతోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నారన్నారు. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే.. మళ్లీ కేసీఆర్‌రే సీఎం కావడం ఖాయమని తేలిపోయిందని అన్నారు. అంతకు ముందు మండల పార్టీ నాయకులతో కలిసి రజతోత్సవ సభ పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యమ నాయకుడు పుప్పాల పీరాజీ, మార్క్‌ఫెడ్ రాష్ట్ర డైరెక్టర్ రేకుల గంగా చరణ్, మాజీ వైస్ ఎంపీపీ మొహియొద్దీన్, మాజీ సర్పంచ్ గోరేకర్ బాబు, గాడేకర్ రమేశ్, దొంతుల గంగాధర్, దొంతుల లింగన్న, దొంతుల దేవీదాస్, గంధం పోశెట్టి, నర్సింలు, తోట శేఖర్, అశ్వఖ్, దత్తాత్రి పాల్గొన్నారు.

## చలో వరంగల్‌పై సన్నాహక సమావేశం



ముథోల్ మండల కార్యకర్తలతో సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న రమాదేవి

ముథోల్, ఏప్రిల్ 17 : బీఆర్ఎస్ పార్టీ ఈ నెల 27న చలో వరంగల్‌లో జరపబోయే భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని ముథోల్ తాలుకా బీఆర్ఎస్ సమన్వయ సమితి కమిటీ సభ్యురాలు పడకంటి రమాదేవి పిలుపునిచ్చారు. గురువారం ముథోల్ మండల బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలతో భైంసాలో సన్నాహక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలం నుంచి గ్రామగ్రామాన కార్యకర్తలు సభకు హాజరు కావాలని కోరారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముథోల్ మండల నాయకులు బండారి గంగాధర్, అశోక్, శంకర్, విఠల్ కాంబ్లే, బాబు, అంజయ్య, అశోక్, గణపతి పాల్గొన్నారు.

## జైలర్ నిర్లక్ష్యంతోనే రిమాండ్ ఖైదీ మృతి

- కుటుంబ సభ్యులు, గ్రామస్తుల ఆరోపణ
- పోలీస్ స్టేషన్ ఎదుట బైఠాయింపు




ముథోల్ పోలీస్‌స్టేషన్ ఎదుట బైఠాయించిన కుటుంబీకులు, గ్రామస్తులు

ముథోల్, ఏప్రిల్ 17 : ఆదిలాబాద్ జిల్లా జైలులో ముథోల్ మండల కేంద్రానికి చెందిన రిమాండ్ ఖైదీ సిందే సాయినాథ్(32) మృతి చెందడంతో గురువారం కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ముథోల్ పోలీస్‌స్టేషన్ ఎదుట న్యాయం కావాలని బైఠాయించారు. సాయినాథ్ మృతికి జైలర్ కారణమని ఆరోపించారు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. గత ఫిబ్రవరిలో ఒక కేసు విషయంలో నిందితుడిగా సాయినాథ్‌తోపాటు ముగ్గురిని ఆదిలాబాద్ జైలుకు తరలించారు. నాలుగు సార్లు బెయిల్‌కు దరఖాస్తు చేసుకున్నా మంజూరు కాలేదు. జైలుకు కుటుంబ సభ్యులు వెళ్లిన జైలర్లు అనుమతి ఇవ్వలేదు. చనిపోయిన తర్వాత బెయిలు మంజూరు చేశారని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆరోపించారు. జైలులో ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రి నుంచి హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి వైద్య చికిత్స కోసం పంపించారు. సాయినాథ్ ఆరోగ్యం బాగాలేదని రెండు రోజుల క్రితం ఆదిలాబాద్ జైలు నుంచి కుటుంబ సభ్యులకు సమాచారం వచ్చింది. సమాచారం రాగానే హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా అప్పటికే సాయినాథ్ స్పృహ లేని స్థితిలో ఉన్నాడు. జైలర్ అశ్రద్ధ వల్ల మృతి చెందాడని పేర్కొన్నారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సాయినాథ్‌కు భార్య, ఒక కుమారుడు ఉన్నారు. ప్రభుత్వం నుంచి కుటుంబానికి ఆదుకోవడానికి స్పష్టమైన హామీ ఇచ్చేదాక కదిలేది లేదని ముథోల్ సర్కిల్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. దీంతో ముథోల్ సీఐ మల్లేశ్, ఎస్సై సంజీవ్ జోక్యం చేసుకుని చట్టపరంగా జ్యూడిషియల్ దర్యాప్తు కోసం ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్తామని వెల్లడించడంతో ఆందోళన విరమించారు.

## పండుగలా తరలి రావాలి

- బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యుడు విలాస్ గాదేవార్

భైంసా, ఏప్రిల్ 17 : రజతోత్సవ సభకు పండుగలా తరలి రావాలని బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యుడు విలాస్ గాదేవార్ అన్నారు. పట్టణంలోని ఎన్ఆర్ గార్డెన్‌లో భైంసా పట్టణ, మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిట్టల దొర రేవంత్‌రెడ్డి మాటలు విని కాంగ్రెస్‌ను గెలిపిస్తే రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారన్నారు. కేసీఆర్ తనదైన శైలిలో పదేళ్లలో అన్ని వర్గాల ప్రజలను అభివృద్ధి పథంలో నడిపించి బంగారు తెలంగాణగా తయారు చేశారన్నారు. వరంగల్‌లో 27న నిర్వహించనున్న గులాబీ పండుగకు వేలాది మంది తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఇందులో బీఆర్ఎస్ నాయకులు నంగి రాజేశ్, రమణారెడ్డి, సురేశ్, పోశెట్టి పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ముథోల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు విలాస్ గాదేవార్